ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రత్యేక చర్యలు
- మెహిదీపట్నం డీఎం బీవీకే మూర్తి



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఉద్యోగుల ఆరోగ్యం పట్ల అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మెహిదీపట్నం డిపో మేనేజర్ బీవీకే మూర్తి అన్నారు. వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు మెహిదీపట్నం డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2–0 ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం గురువారం ముగిసింది. డాక్టర్ జహీరా ఉద్యోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, ఇతర రిపోర్టులు చూసి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఎం మూర్తి మాట్లాడుతూ.. సంస్థకు కార్మికులు గుండెకాయలాంటి వారని చెప్పారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థకు మనుగడ ఉంటుందని, అందుకే ప్రతి ఒక్కరూ విధులతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తమపై ఎంత ఒత్తిడి ఉన్నా.. వాటిని అధిగమించి సంస్థ అభివృద్ధికి కార్మికులు పాటుపడుతున్నారని కితాబిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, కార్మికులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకూడదని అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) నమ్రత పేర్కొన్నారు. వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించడంపై కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈడబ్ల్యూబీ సభ్యుడు ఎంఏ సలీం, ఏఈఎం ఎ.ప్రకాశ్‌రావు హెల్త్ వాలెంటర్ సీహెచ్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో స్టార్టప్‌లపై అవగాహన



గోల్కొండ: నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ఐపీ పాత్ర ఎంతో కీలకమని ఇండియా పెటెంట్ అండ్ డిజైన్ అటార్నీ ఐపీ అండ్ స్టార్టప్ ఫెసిలిటేటర్ మేనేజింగ్ ప్రార్టనర్ నేహా గోయల్ అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఐపీఆర్, ఐపీ మేనేజ్‌మెంట్‌పై హైబ్రిడ్ మాధ్యమంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐపీ హక్కులను నిర్వహించడంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో స్టార్టప్‌ను సాధించడంలో ప్రభావవంతంగా అభివృద్ధి చెందడానికి ఎన్నో నైపుణ్యాలు అవసరమని అన్నారు. కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి మాట్లాడుతూ మేధోసంపత్తి హక్కులు ఆవిష్కరణ, ఆర్థిక, సంస్కృతిక అభివృద్ధిని ప్రోత్సహించడంలో స్టార్టప్‌ల పాత్ర కీలకమన్నారు. జీఎన్ఐటీఎస్ వైస్ చైర్ పర్సన్ సి.విద్యారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, ఐఅండ్ఐ డీన్ డాక్టర్ ఎన్.కల్యాణి, కోఆర్డినేటర్ డాక్టర్ పి.రేఖ, కో ఆర్డినేటర్లు డాక్టర్ టి.మాలతీలత, డాక్టర్ కె.మృదుల పాల్గొన్నారు.

గన్‌మెన్‌ల సేవలు వెలకట్టలేం

గోల్కొండ: ప్రజా ప్రతినిధుల ప్రాణాలకు రక్షణగా ఉండడమే కాకుండా ఎప్పుడూ అప్రమత్తంగా ఉండే గన్‌మెన్‌ల సేవలు వెలకట్టలేమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ప్రభుత్వం తనకు కేటాయించిన గన్‌మెన్‌లను ఆయన గురువారం టోలిచౌకీలోని తన కార్యాలయంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. తాను మూడో సారి ఎమ్మెల్యేగా గెలిచానని ఈ కాలంలో వివిధ గన్‌మెన్‌లు తనకు రక్షణ కవచంగా ఉన్నారన్నారు.



తన గన్‌మెన్‌లతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

సర్వరోగ నివారిణి యోగా



చార్మినార్: జాతీయ యోగా దినోత్సవాలను పురస్కరించుకుని సాలార్‌జంగ్ మ్యూజియంలోని ఈస్టర్న్ బ్లాక్‌లో స్పెషల్ ఎగ్జిబిషన్‌ను గురువారం బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం యోగా చేస్తే మానసిక, శారీరక రుగ్మతలు దరిజేరవన్నారు. సర్వరోగ నివారిణి యోగా అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రంలో మ్యూజియం అకౌంట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, క్యూరేటర్లు ఘన్‌శ్యాం కుసుం, ఆర్‌బీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీలకు వెంటనే శిక్షణ కల్పించి సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను ఇవ్వాలని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వేదిక నేతలు విజ్ఞాన దర్శిని, ఉమేష్ చప్పరి, శంకర్ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, బాల బ్రహ్మచారి, రామాశంకర్, భాస్కర్ మాట్లాడారు. 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జీఓ నెంబర్ 273 ద్వారా ఆర్ఎంపీ, పీఎంపీలందరికీ కమ్యూనిటీ పారామెడిక్స్‌గా శిక్షణ ఏర్పాటు చేసి 13 వేల మందికి శిక్షణ ఇచ్చారన్నారు. నాడు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వైఎస్ మరణాంతరం నేటికి



సమావేశంలో మాట్లాడుతున్న వేదిక నేతలు

సర్టిఫికెట్లు ఇవ్వలేదని వాపోయారు. దీంతో ఆర్ఎంపీ, పీఎంపీ కుటుంబాలు అభద్రతలో జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కౌన్సిల్ అధికారులు తమపై దాడులు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో రవిశంకర్, మోహన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బస్ స్టాప్ ఎక్కడ..?



బస్సు కోసం ప్రయాణికుల పరుగులు

- ప్రధాన బస్టాప్ విషయమై ఉద్రిక్తత
- ఒకేరోజు మూడు సార్లు బస్‌స్టాప్‌ను మార్చిన అధికారులు
- ఇబ్బందిపడిన ప్రయాణికులు

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ బస్టాప్ స్థల మార్పుకు యత్నించడంతో గురువారం లంగర్‌హౌస్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళ్తే..లంగర్‌హౌస్‌లో ప్రధాన బస్టాప్ బాపునగర్ ప్రధాన రహదారి వద్ద ఉంది. ఇక్కడి నుంచి విద్యార్థులు, వివిధ గ్రామాలు, వికారాబాద్, తాండూరు, కర్నాటక తదితర ప్రాంతాల వారు ప్రయాణం కొనసాగిస్తుంటారు. అయితే ఇక్కడ బస్టాప్‌ను మార్చేందుకు ఆర్టీసీ అధికారులు గురువారం ప్రయత్నించారు. బస్సు వచ్చి నిలపగానే అక్కడ ఉన్న అధికారులు బస్సులను ముందుకు పోనివ్వాలంటూ ప్రయాణికులను ఎక్కనివ్వలేదు. బస్టాప్‌ను మార్చామని అక్కడే ఎక్కాలని ప్రయాణికులకు సూచించారు.

పోలీసుల అత్యుత్సాహం..

లంగర్‌హౌస్‌లో బస్టాప్ ఎక్కడ అని తీవ్ర సందేహంలో ఉన్న ప్రయాణికులు అక్కడ అధికారుల సమాచారంతో అటు ఇటు తిరుగుతున్న ప్రయాణికులపై వ్యాపారులు దాడులకు దిగడంతో నివ్వెరపోయారు. దాడి బాధితుల్లో కొందరు వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అయితే అక్కడకు వచ్చిన పోలీసు కానిస్టేబుళ్లు సమస్యను విని సద్దుమనిగేలా చేయలేరు. ఏదైనా ఉంటే స్థానికంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలి కాని ఇలా 100కు ఫోన్ చేసి చెబితే సహించేది లేదని ప్రయాణికులను బెదిరించడంతో పోలీసుల తీరుకు ఆశ్చర్యపోయారు.

వ్యాపారుల దాడులు..

ముందుకు బస్టాప్ మార్చామని చెప్పగా ప్రయాణికులు అక్కడి నుంచి అధికారులు చెప్పిన వైన్స్ దుకాణం పక్కన నిలబడ్డారు. అక్కడ వ్యాపారులు ఇది బస్‌స్టాప్ కాదని ప్రయాణికులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. మరి కొంత ముందు బస్సులు నిలిపేందుకు మరో స్థానాన్ని అధికారులు గుర్తించారు. అక్కడ కూడా వ్యాపారులు ఇక్కడ ఎవరు నిలబడకూడదని ప్రయాణికులపై దాడికి దిగారు. ఇలా ఒకేరోజు మూడుసార్లు అధికారులు బస్టాప్‌ను మార్చారు.



స్థానికులు, ప్రయాణికులు, ఆర్టీసీ అధికారుల మధ్య వాగ్వాదం

అందరూ సహకరిస్తే బాగుంటుంది..

పెట్రోల్ బంక్ ముందు ఉన్న బస్టాప్ వల్ల తమ వ్యాపారానికి ఇబ్బంది అవుతుందని నిర్వాహకులు హైకోర్టుకు వెళ్లారు. అక్కడి నుంచి మారిస్తే మావి వ్యాపారాలు కావా, మాకు ఇబ్బంది కాదా అంటూ ఇతర వ్యాపారులు తిరగబడుతున్నారు. ప్రస్తుతం బాపూఘాట్ ద్వారం వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేసి, ప్రయాణికులకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నాం. స్థానికులు, వ్యాపారులు అంగీకరించి ఒక స్థానం చూపిస్తే అందరికీ అందుబాటులో ఉండేలా బస్‌స్టాప్ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– క్రిష్ణమూర్తి, డిపో మేనేజర్ మెహిదీపట్నం

ప్రయాణికుల ఆగ్రహం..

తాము గ్రామాల నుంచి వచ్చామని రోజులో 4 బస్సులు తమ ప్రాంతాలకు వెళ్తుండగా వాటిని నిలపకుండా పంపారంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం బస్‌స్టాప్ బోర్డు కూడా ఏర్పాటు చేయకుండా వ్యాపారులతో కలిసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఎలా అంటూ అధికారులపై, బస్సులపై దాడికి దిగారు. దీంతో ఆర్టీసీ అధికారులు అక్కడి నుంచి పారిపోయారు. వివిధ ప్రాంతాల డిపోల నుంచి వచ్చిన బస్సు డ్రైవర్లు వారికి తెలియక ఆ బస్సులను నిలుపగా వ్యాపారులు కూడా దాడికి దిగడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

సింగరేణి కంపెనీ మరింత అభివృద్ధి సాధించాలి



చార్మినార్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బాల్‌రాంను ఆల్ ఇండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎస్సీ ఎస్టీ ఓబీసీ, మైనార్టీస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్‌రాజ్, కప్ప కృష్ణాగౌడ్ కలిసి సన్మానించారు. ఆయన హయాంలో సింగరేణి కంపెనీ మరింత అభివృద్ధి సాధించాలని కోరినట్లు తెలిపారు.

బంగారు మైసమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ నూతన కమిటీ కార్యవర్గాన్ని అధ్యక్షుడు ఏ.రాజేశ్ వెల్లడించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్ యాదవ్, ఉపాధ్యక్షులుగా అనంతోజ్ హన్స్‌రాజ్, ప్రకాష్ యాదవ్, కోశాధికారిగా పాపయ్య, సంయుక్త కార్యదర్శిగా సంజయ్ సర్దా, కార్యనిర్వాహక కార్యదర్శిగా నాగేష్ షిండే, ప్రచార కార్యదర్శిగా శ్రీధర్ కామ్‌శెట్టిలతో పాటు సలహాదారులుగా కె.ప్రవీణ్ కుమార్ గౌడ్, ధనంజయ ముదిరాజ్, శంకర్ అగర్వాల్, ఆత్రేయ పంతులు, చంద్రశేఖర్, వినయ్ దిల్లికర్, దిలీప్ భాయ్ తదితరులు న్నట్లు రాజేశ్ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రేటర్ అభివృద్ధి

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రేటర్ అభివృద్ధి సాధ్యమని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వేగవంతంగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరీ సింగ్ గురువారం మంత్రిని కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంతో పాటు అన్ని ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, సీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న పరమేశ్వరీ సింగ్ తదితరులు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కార్పొరేటర్లతో కలిసి 201 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలపై పేద ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే అనేక మంది ప్రజలు ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొంతున్నారన్నారు. రెయిన్‌బజార్, డబీర్‌పురా, పత్తర్‌గట్టీ కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, అలాందార్ వాలాజాహి, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, చార్మినార్ తహసీల్దార్ నిహారిక, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: బస్తీ దవాఖానా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ బస్తీ దవాఖానా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంజాద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, సపోర్టింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం హైదరాబాద్ ఇన్‌చార్జి సన్నిత్, సంఘం సభ్యులు కుశాల్, సుదర్శన్, మొహిన్, వహీం, విక్రమ్ పాల్గొన్నారు.

రమణీయం వన్షిక భరతనాట్యం



గన్‌ఫౌండ్రీ: శ్రీరామ నాటక నికేతన్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు మంజుల రామస్వామి శిష్యురాలు వన్షిక సుదర్శన్ భరతనాట్య ఆరంగేట్రం రవీంద్రభారతిలో జరిగింది. పుష్పాంజలి గణేష స్తుతి, పాద వర్ణం, శంకర శ్రీగిరి, థిల్లాన వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ..10వ తరగతి విద్యను అభ్యసిస్తూ భరతనాట్యం నేర్చుకుని వందలాది ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అలేఖ్య కుంజాల, సినీ దర్శకుడు నాగ్ అశ్విన్, పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రేణు, ఎయిర్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ కెప్టెన్ శోమాసుర్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయించండి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీ

అబిడ్స్: ఉద్యోగుల పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డీఎన్జీఓస్ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు బకాయిలు పడ్డ డీఏలను విడుదల చేస్తే వారికి ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామినేని శ్రీనివాసరావు, ఉమాదేవి, గోవర్ధన్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రచయిత్రి దూలిపాల అరుణ రచించిన ఆచార్య అనుమాండ్ల భూమయ్య సాహిత్యావలోకనం పుస్తకావిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సాహిత్యానికి సంబంధించిన పలు విషయాలను రచయిత్రి చక్కగా రచించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓయూ తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ, పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, రచయిత్రి ఎన్.రమాదేవి, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

‘ఆల్బెండజోల్’తో చిన్నారులకు ఆరోగ్యం

- జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాత్రలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

చార్మినార్: దారుషిఫా యూపీహెచ్‌సీలో గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమలో పురస్కరించుకుని చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ పాల్గొని చిన్నారులకు నులి పురుగుల నివారణ మందులు (ఆల్బెండజోల్) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్బెండజోల్ మాత్రలతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ తబ్బసుం, మహ్మద్ మసూద్, మహ్మద్ వాహేద్, మహ్మద్ సాబేర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండలో..

గోల్కొండ: అర్హులైన ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మందులు అందించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల మందు బిల్లలు ఇచ్చారు.

పురానాపూల్‌లో..

దూద్‌బౌలి: పురానాపూల్ డివిజన్ మజ్లిస్ పార్టీ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ గురువారం పురానాపూల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పాల్గొన్న ఆయన మందులు అందజేశారు. డాక్టర్ బుష్రా తదితరులు పాల్గొన్నారు.

విద్యాశ్రీ స్కూల్‌లో..

జియాగూడ: నులిపురుగుల నివారణకు ఆలెబండజోల్ మాత్రలు అందరికీ సురక్షితమైనవని జియాగూడ మాజీ వార్డు సభ్యుడు దర్పల్లి నర్సిములు అన్నారు. గురువారం నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కార్వాన్ ఫన్నీపురా యూపీహెచ్‌సీ ద్వారా డాక్టర్ బి.పూర్ణిమ నేతృత్వంలో జియాగూడలోని విద్యశ్రీ హైస్కూల్, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు ఎ.అమ్మాజీ, దేవి, ఆశ వర్కర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జాంబాగ్‌లో..

సుల్తాన్‌బజార్: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్బెండజోన్ మాత్రలు వేయించాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. జాంబాగ్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, వైద్య సిబ్బంది చిన్నారులకు నులిపురుగుల మందులు అందించారు.

డబీర్‌పురా క్లస్టర్ ఆధ్వర్యంలో..

యాకుత్‌పురా: వైద్య విధాన పరిషత్ డబీర్‌పురా క్లస్టర్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహించారు. యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు మాత్రలు పంపిణీ చేశారు. ఎస్పీహెచ్ఓ డాక్టర్ రాజాకుమారి, యాకుత్‌పురా–2 యూపీహెచ్‌సీ వైద్యాధికారిణీ డాక్టర్ ఆయేషా ముదాసిర్, పాల్గొన్నారు.



మాత్రలు వేస్తున్న నర్సిములు, డాక్టర్ పూర్ణిమ



పిల్లలకు మందులు వేస్తున్న ఎమ్మెల్యే కౌసర్



ట్యాబ్లెట్‌ను వేస్తున్న మహ్మద్ సలావుద్దీన్ లోధీ



గోల్కొండ తెలుగు ప్రభుత్వ పాఠశాలలో..



పురానాపూల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో..

న్యూ పారామౌంట్ స్కూల్‌లో..



అబిడ్స్: గోషామహల్ ఆగాపురాలో న్యూ పారామౌంట్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు కార్పొరేటర్ లాల్ సింగ్ నులి పురుగుల మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. 9 ఏళ్ల పిల్లలకు ప్రతి సంవత్సరం నులి పురుగుల మందులు వేయాలన్నారు. ఎస్పీహెచ్ఓ డాక్టర్ మల్లేశ్వరీ, డాక్టర్ రాంచందర్, ప్రధానోపాధ్యాయులు పద్మావతి, నవీన్ అగర్వాల్, గోపాల్ సింగ్, అక్షయ్ సాహు, సుధాకర్ గౌడ్, దీపక్ కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు



ఉత్సవాల్లో ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: బేగంబజార్ ఫీల్‌ఖానాలో సయ్యద్ హజ్రత్‌అలీ ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ ఉర్సు ఉత్సవాల్లో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మత సామరస్యానికి ప్రతీకగా ఉర్సు ఉత్సవాలు దోహద పడుతాయన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల పండుగలను ప్రభుత్వమే నిర్వహించిందన్నారు.

నిజాం కాలేజీలో నేడు యోగా దశాబ్ది ఉత్సవాలు

సాక్షి,సిటీబ్యూరో: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నేడు నగరంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నేడు ఉదయం 6 గంటలకు నిజాం కాలేజీ గ్రౌండ్ వేదికగా జరిగే యోగా దశాబ్ది ఉత్సవాల్లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. మంత్రితో పాటు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర బొగ్గు గనుల సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే తదితర పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.